ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.20.07.2025 సమయం.18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి 1,290 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.
2. హైదరాబాద్ లాలా దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఘనంగా సాగుతోంది.
3. నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.తారక రామారావు అన్నారు.
4. తెలంగాణ వ్యాప్తంగా రాగల 48 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

....................................

**బోనాలు :**

జంట నగరాల్లో బోనాల పండగ ప్రశాంతంగా జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం తరఫున లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి 1,290 కోట్ల రూపాయలు, అలాగే జంట నగరాల్లో బోనాలకు ప్రత్యేకంగా 20 కోట్ల రూపాయలు కేటాయించినట్లు వెల్లడించారు. కాగా హైదరాబాద్ లాల్‌దర్వాజా సింహవాహిని మహాకాళి అమ్మవారి బోనాల జాతర ఘనంగా కొనసాగుతోంది. ఈ

ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో మహంకాళిని దర్శించుకొని పూజలు నిర్వహించి బోనాలను సమర్పిస్తున్నారు. ఆలయం వద్ద నాలుగు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. బోనాలు తెచ్చేవారి కోసం ప్రత్యేక క్యూలైన్ అందుబాటులో ఉంచారు. 1200 మంది పోలీసులు, 10 షీ టీమ్స్‌తో ఆలయం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. మహంకాళి అమ్మవారిని మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

డెస్క్

**సురేష్ రెడ్డి:**

డీలిమిటేషన్ ప్రక్రియపై పార్లమెంటులో సమగ్ర చర్చ జరగాలని బిఆర్ఎస్ ఎంపీ సురేష్ రెడ్డి అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ఈ ప్రక్రియను చేపట్టాలన్నారు. అలాగే నదుల అనుసంధానానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని, తగిన అనుమతులు, సంప్రదింపులతో నదుల అనుసంధానం జరగాలని ఆయన సూచించారు. నీటి విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని నదుల అనుసంధానం పేరుతో జలదోపిడి చేస్తే, తాము సహించబోమని సురేష్ రెడ్డి స్పష్టం చేశారు.

డెస్క్

**దోమల నివారణ :**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దోమల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు స్వయంగా వెళ్లి యాంటీ లార్వా ఆపరేషన్లను పర్యవేక్షించాలన్నారు. డెంగ్యూ, మలేరియా నివారణకు నీరు నిల్వ ఉంచకుండా అవగాహన కల్పించాలని కోరారు. పాఠశాలలు కళాశాలల్లో కూడా యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించాలని కమిషనర్

సూచించారు. అలాగే జంట నగరాల వ్యాప్తంగా కొనసాగుతున్న రోడ్ల మరమ్మత్తు పనులు మరో వారంలోగా పూర్తి చేయాలని కమీషనర్ అధికారులను ఆదేశించారు. రోడ్ల పై గుంతలను పూడ్చిపేయాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

డెస్క్

**వాతావరణం :**

తెలంగాణ వ్యాప్తంగా రాగల 48 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.రేపు ఉమ్మడి ఆదిలాబాద్,ఉమ్మడి కరీంనగర్, వరంగల్,భూపాలపల్లి,మహబూబాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. మిగతా జిల్లాల్లో ఈ నెల 24 వరకు వర్ష సూచన ఉందని పేర్కొంది.

డెస్క్

**రాహుల్ సిప్లిగంజ్**

స్వయంకృషితో హైదరాబాదు నుంచి ఆస్కార్ స్థాయికి ఎదిగిన రాహుల్ సిప్లిగంజ్ యువతకు ఆదర్శమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను ప్రశంసించారు. ఈ సందర్భంగా రాహుల్ కి కోటి రూపాయల బహుమానాన్ని ముఖ్యమంత్రి ప్రకటించారు

డెస్క్

**పార్లమెంట్ సమావేశాలు :**

ఆపరేషన్ సిందూర్ సహా ఇతర కీలక అంశాలపై పార్లమెంట్లో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రేపటి నుంచి ప్రారంభం కాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో 17 బిల్లులు ప్రవేశపెట్టనున్నామని, ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య సమన్వయం ఉంటే సభ సజావుగా సాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. డెస్క్

**కెటిఆర్**

నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకూడదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.తారక రామారావు అన్నారు. రాజస్థాన్, జైపూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించిన దక్షిణ భారతదేశానికి ఈ విషయంలో నష్టం కలిగితే ప్రజల నుంచి వ్యతిరేకత, అసంతృప్తి వ్యక్తం అయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే మాతృభాష అనేది మాట్లాడానికే కాదని, సంస్కృతికి ఒక గుర్తింపు లాంటిదన్నారు. భారత్‌లో 22 అధికార భాషలు, 300 అనాధికార భాషలు ఉన్నాయని చెప్పారు. హిందీ భాష విషయంలో కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల్లో సడలింపు దోరణిని అవలంభించాలని ఆయన సూచించారు.

డెస్క్

**జాతీయ ఆరోగ్య మిషన్**

జాతీయ ఆరోగ్య మిషన్ కింద రాష్ట్రంలో పనిచేస్తున్న 51,451 మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్ ను 2026 సం మార్చి వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ ఏడాది మార్చిలోనే వారి కాంట్రాక్టు గడువు ముగియగా, మూడు నెలలుగా వారి సర్వీసు పొడిగించలేదు. ఇప్పటి ప్రభుత్వం వారి సర్వీసును రెన్యువల్ చేసింది. అలాగే ప్రధానమంత్రి అభిమ్ పథకం కింద 1500 మంది, NHM కింద పలు పథకాల్లో చేసే మరో 1,760 మందిని మరో ఏడాదిపాటు కొనసాగించనుంది.

డెస్క్

**రాజన్న సిరిసిల్ల జిల్లా**

స్థానిక సంస్థల ఎన్నికలకు పోలీస్ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది

సమావేశంలో ఆయన మాట్లాడుతూ  శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ స్పష్టం చేశారు.

పి టి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**జనగామ జిల్లా**

అధునాతనమైన బోధన, పోషకాలు కలిగిన ఆహారం, మెరుగైన మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యంగా విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం  మార్పులను తీసుకువస్తోందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్  పేర్కొన్నారు. అలాగే  జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో U సీటింగ్ విధానంతో ప్రయోగం చేస్తున్నామని, యు విధానంతో తరగతి గదిలో  ప్రతి విద్యార్థి పై ఉపాధ్యాయుడి  దృష్టి ఉండి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు.  U సీటింగ్ వల్ల విద్యార్థులందరి ఏకాగ్రత ఉపాధ్యాయుల బోధన వైపు ఉండి వారి అభ్యసన సామర్థ్యం మెరుగవుతుందని అన్నారు. తరగతి గదిలో ఈ విధానంలో కూర్చొబెడితే విద్యార్థుల మధ్య అసమానతలను తొలగిపోయి, వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు.

పిటిసి, జనగామ జిల్లా

**నాగార్జున సాగర్**

ఎగువ ప్రాంతాలకు వస్తున్న వరద కారణంగా నాగార్జున సాగర్ ఎడమ కాలువకు అధికారులు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం 565 అడుగులకు చేరుకోవడంతో వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 565 అడుగులకు వరద నీరు చేరింది.

డెస్క్

**ఇందిరా మహిళా శక్తి**

మహిళలే అభ్యున్నతి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. కల్వకుర్తిలో జరిగిన ఇందిరా మహిళ శక్తి సంబరాల్లో కలెక్టర్ తో పాటు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 57 స్వయం సహాయక మహిళా సంఘాలకు చెక్కులను, అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని, మహిళల ద్వారా కుటుంబాలు అభ్యున్నతి పథంలో పయనించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని ఎమ్మెల్యే అన్నారు.

**కలెక్టర్ సౌండ్ బైట్ ............**

PTC నాగర్‌కర్నూల్ జిల్లా

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:**

భద్రాచలం ఐ టి డి ఏ ద్వారా గిరిజనులకు అందిస్తున్న వివిధ స్వయం ఉపాధి పథకాలు, సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించడానికి ప్రిన్సిపల్ ఇన్వెస్ట్ గ్రేటర్ ఆఫ్ ద ఫోజ్ ప్రాజెక్ట్, ఐఐటి బాంబే ప్రొఫెసర్ కన్నన్ ఈరోజు భద్రాచలంలోని ట్రైబల్ మ్యూజియంను సందర్శించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. రాహుల్ తో పాటు ప్రొఫెసర్ కన్నన్ మ్యూజియంను సందర్శించారు. అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలు నేటితరానికి తెలియజేసే విధంగా మ్యూజియం రూపకల్పన చేయడం ప్రశంసనీయమన్నారు. గిరిజనుల వస్తువులు ఆభరణాలు, వారి జీవన విధానాల పెయింటింగ్ చిత్రాలను కళ్ళకు కట్టినట్లు అమర్చడం ప్రత్యేకంగా ఆకట్టుకుందని ఆయన అన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజన నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో

ఉద్యోగాలు పొంది జీవనోపాధి పెంపొందించుకోవడానికి పై టి సి ద్వారా ప్రత్యేక శిక్షణలు అందిస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు.

PTC- B.KGM

**ఆది శ్రీనివాస్**

గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట నక్క వాగుపై, మర్రిపల్లి గ్రామం వద్ద కోరుట్ల - వేములవాడ ప్రధాన రహదారిపై నిర్మించిన రెండు బ్రిడ్జి లను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ బ్రిడ్జిల ప్రారంభంతో గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న రవాణాపరమైన ఇబ్బందులు తొలగిపోయాయని ఆది శ్రీనివాస్ అన్నారు.

**సౌండ్ బైట్ ............**

పిటిసి రాజన్న సిరిసిల్ల జిల్లా